హామీలు ఫుల్.. అమలు నిల్

- ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయని కూటమి ప్రభుత్వం
- నియోజకవర్గంలో ఎక్కడి సమస్యలు అక్కడే
- ఇది మంచి ప్రభుత్వం పేరుతో ప్రచారానికి శ్రీకారం
- ప్రభుత్వ పాలనపై సర్వత్రా విమర్శలు


అధ్వానంగా ఉన్న ఏలేశ్వరం నుంచి ఏజెన్సీ వెళ్లే ప్రధాన రహదారి


ఏలేరు కాలువపై కూలిపోయిన వంతెన

ఏలేశ్వరం: ఊరంతా పిండి కొడుతుంటే కోతి నెత్తికొట్టుకుందట అన్నట్టు ఉంది కూటమి ప్రభుత్వం పరిస్థితి. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులైనా ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేరలేదు. పైగా గత ప్రభుత్వంలో ఏదో ఒక పథకం రూపంలో ప్రతినెలా ప్రజలకు బ్యాంక్‌ఖాతాలో డబ్బులు పడేవి. దీంతో ప్రజలు కనీస అవసరాలు తీర్చుకొనేవారు. అలాంటిది ఏమీ లేకపోగా కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులైన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం పేరుతో గ్రామాల్లో ప్రచారం మొదలు పెట్టడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలోని పలు సమస్యలపై కూటమి ప్రభుత్వం హామీలు ఇచ్చింది. దీనిలో ఒక్క హామీని కూడా ఇప్పటివరకూ నెరవేర్చలేదు.

హామీలు ఇలా..

గత ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు ఏలేశ్వరం నియోజకవర్గానికి సంబంధించి పలు హామీలు గుప్పించారు. ఏలేశ్వరం నుంచి ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి పునర్నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల వర్షాలకు ఈ రహదారిపై పడిన గోతులు చెరువుల్లా మారడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఏలేరు కాలువపై నిర్మించిన వంతెన కూలిపోవడంతో అధికారంలోకి రాగానే పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఇది నెరవేర్చకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు వంతెన మొత్తం కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. ప్రత్తిపాడు మండలంలో 10 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు సుబ్బారెడ్డి సాగర్, ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందించే చంద్రబాబుసాగర్ ఆధునీకీకరణ పనులు ప్రారంభించలేదు. శంఖవరం మండలంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని శంఖవరం నుంచి పెదమల్లాపురం మీదుగా వేళంగి వెళ్లే ప్రధాన రహదారికి గత ప్రభుత్వం రూ.6.50 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. ఎన్నికలనంతరం ఇప్పటివరకూ కూటమి ప్రభుత్వం ఆ పనులు మొదలు పెట్టలేదు. రౌతులపూడి మండలంలో ములగపూడిలో 300 ఎకరాలకు సాగునీరు అందించే పెద్దచెరువు ఆధునీకీకరణ పనులనూ ప్రారంభించిన పాపానపోలేదు.

అధ్వానంగా రహదారులు

ఇటీవల వర్షాలకు కురిసిన వర్షాలకు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. వీటిపై రాకపోకలు సాగించడం ప్రజలకు నరకప్రాయంగా మారింది. వీటికి తాత్కాలిక మరమత్తులు చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఈ సమస్యలు ఇలా ఉంటే మంచి ప్రభుత్వం పేరుతో కూటమి ప్రభుత్వం ప్రచారం చేయడంపై ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

రహదారి, వంతెన పనులు ప్రారంభించాలి



సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏలేరు కాలువపై వంతెన నిర్మాణం, ఏజెన్సీ వెళ్లే ప్రధాన రహదారి పునర్నిర్మించాలి. ప్రజా సమస్యలు పక్కనపెట్టి మంచి ప్రభుత్వం పేరుతో ప్రచారం చేయడం సిగ్గుచేటు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేసుకోవాలి.

– పైల విజయ్‌కుమార్, ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏలేశ్వరం

'అమ్మకు వందనం' అమలు చేయాలి



ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు అమ్మకు వందనం పథకాన్ని అమలు చేయాలి. ప్రతి విద్యార్థికి రూ.15,000 చొప్పున వారి తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయాలి. విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా పథకాన్ని అమలు చేయలేదు. గత ప్రభుత్వంలో ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అమ్మఒడి పథకాన్ని అమలు చేశారు.

– ఏనుగు మాధవి, రాచపల్లి, ప్రత్తిపాడు రూరల్

ఆశగా ఎదురుచూస్తున్నాం



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాం. కూటమి నేతలు ఎన్నికలకు ముందు ఎంతో ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా సీఎం గానీ, ఇతర నేతలు గానీ ఇంత వరకు ఆ హామీ గురించి నోరు మెదపడం లేదు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేసే ఉద్దేశం నేతల్లో కనిపించడం లేదు.

– పెదపాటి సుజాత, ప్రత్తిపాడు, ప్రత్తిపాడు రూరల్

మోసం చేస్తున్నారు



కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో సంక్షేమాన్ని గాలికి వదిలేసి ప్రచారానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. కూటమి నేతలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా ప్రజలను పూర్తిగా మోసం చేస్తున్నారు. ఆచరణ సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదు.

– రామిశెట్టి ఏసుబాబు, సర్పంచ్, గౌరంపేట, శంఖవరం మండలం

క్లుప్తంగా

ఏలేశ్వరంలో లోన్‌మేళా


ఏలేశ్వరం ఎస్‌బీఐ బ్రాంచిలో లోన్‌మేళాకు హాజరైన లబ్ధిదారులు

ఏలేశ్వరం: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి కార్యాలయంలో ఆదివారం లోన్‌మేళా నిర్వహించారు. సక్రమంగా లోన్‌కట్టిన వారికి రూ.20 వేలు, రూ.50 చొప్పున లోన్‌లు ఇచ్చారు. లోన్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమలో మెప్మా టీఎంసీ సాయికుమార్, బ్యాంక్ సిబ్బంది, సుమారు 50 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడిలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అన్నదానంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పాల్గొన్నారు. తొలుత గణనాథునికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సూర్నీడి నాగమణి, నాయకులు దోరె రామకృష్ణ, సూర్నీడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు


పెద్దనాపల్లిలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ఏలేశ్వరం: మండలంలోని పెద్దనాపల్లిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వివేకానందా ట్రస్టు, సుంకర సత్తిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ప్రారంభించారు. జగ్గంపేట సాయి ఆసుపత్రి, రాజమహేంద్రవరానికి చెందిన గౌతమి నేత్రాలయం, కేఎస్ఆర్ ఆసుపత్రి వైద్యులు భాగ్యలక్ష్మి, రఘు, రమ్య సుమారు 150 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. అనంతరం 40 మందికి కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం


జి.కొత్తపల్లిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికుడు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయదర్గ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

ఘనంగా మరిడమ్మ జాతర


ఎస్.పైడిపాలలోని ఓ వీధిలో మరిడమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

రౌతులపూడి: మండలంలోని ఎస్.పైడిపాలలో మరిడమ్మతల్లి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఏటా సెప్టెంబర్‌లో ఉత్తర కార్తె మొదటి ఆదివారం రోజున అమ్మవారి పండగను జరుపుకోవడం ఇక్కడ ఆనవాయితీ. భక్తులు తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి పూజలు చేశారు. సాయంత్రం వీధుల్లోని ప్రధాన రహదారుల్లో అమ్మవారిని పసుపు, కుంకుమ, పండ్లుతో పూజించారు. అనంతరం భక్తులు తమ ఇళ్ల వద్ద తయారు చేసిన వివిధ రకాల పిండివంటలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

రేపు ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

గోకవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం మండలస్థాయి ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్టు ఉపాధి ఏపీఓ శేష అప్పలరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన అన్ని రకాల పనులకు సామాజిక తనిఖీలు నిర్వహించామన్నారు. వీటిలో గుర్తించిన అంశాలను సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడిస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా వినాయక నిమజ్జనం


ఏలేశ్వరంలో గణపతి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఏలేశ్వరం: గణపతి నవరాత్రులు ముగిసాయి. స్థానిక నందివీధి, పెద్దవీధి, వెంగళరావుకాలనీ దుర్గాదేవి గుడి వద్ద, దిబ్బలపాలెం సంతోషిమాత ఆలయం, రామాలయం వద్ద నెలకొల్పిన స్వామివారి విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. మేళతాళాలు, తీన్‌మార్, బాణసంచా కాల్పుల నడుమ స్వామివారి విగ్రహాన్ని స్థానిక మెయిన్ రోడ్డు, బాలాజీచౌక్, మార్కెట్ రోడ్డు, పల్లపువీధి మీదుగా ఊరేగించి స్థానిక ఏలేరు నదిలో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో మహిళలు, యువకులు సందడి చేశారు. కాగా స్థానిక బాలాజీచౌక్ వద్ద రెండువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో భక్తులు, స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. పోలీసులు ప్రేక్షక ప్రాత పోషించారు. ఎట్టకేలకు ఘర్షణ సద్దుమణగడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

డీఎస్పీని కలసిన సీఐ, ఎస్‌ఐలు


డీఎస్పీ శ్రీహరిరాజుకు స్వాగతం పలుకుతున్న సీఐ, ఎస్‌ఐలు

గండేపల్లి: పెద్దాపురం డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన శ్రీహరి రాజును జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు, గండేపల్లి ఎస్‌ఐ యువి శివనాగబాబు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎస్పీకి మొక్కను అందజేసి స్వాగతం పలికారు. డీఎస్పీతో పలు అంశాలపై చర్చించారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలంటూ ధర్నా


జగ్గంపేట శివారు రంగవల్లీ నగర్‌లో ఆందోళన చేస్తున్న రైతుకూలీలు

జగ్గంపేట: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయడం ఆపాలని, రాష్ట్ర అసెంబ్లీలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జగ్గంపేట శివారు రంగవల్లీ నగర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి గుండె వంటి విశాఖఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయడానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పావులు కదుపుతోందన్నారు. దీనికి వ్యతిరేకంగా విశాఖతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో కార్మికులు పోరాడుతున్నా కేంద్రం పట్టించుకోడటం లేదన్నారు. కార్పొరేట్ సంస్థలకు దీనిని కట్టబెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని, కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్‌టీయూ నేతలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ క్రికెట్ పోటీలు ప్రారంభం

జగ్గంపేట: స్థానిక బాలాజీ రైస్ మిల్లు ఎదురుగా ఉన్న మైదానంలో ఆదివారం నియోజకవర్గస్థాయి ఉపాధ్యాయ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ క్రికెట్ పోటీలను జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ ప్రారంభించారు. పలువురు ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు పాల్గొన్నారు.

అస్సాగో ఫ్యాక్టరీ వద్ద ఆందోళన


అస్సాగో ఫ్యాక్టరీ వద్ద ఆందోళన కారులతో మాట్లాడుతున్న ఎస్సై పవన్‌కుమార్

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలో అస్సాగో ఫ్యాక్టరీ వద్ద ఆదివారం రాత్రి గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టారు. ఫ్యాక్టరీ నుంచి దుర్వాసన వెదజల్లుతోందని, పగలు, రాత్రి తేడా లేకుండా వస్తున్న దుర్వాసనను భరించలేకపోతున్నామంటూ నిరసన వ్యక్తం చేశారు. యాజమన్యం తక్షణమే స్పందించకపోతే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని ఆందోళనకారులు హెచ్చరించడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న గోకవరం ఎస్సై పవన్‌కుమార్ హుటాహుటిన అక్కడకు చేరుకుని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. ఫ్యాక్టరీ యాజమాన్యం, ఆందోళన కారులతో ఆయన చర్చలు జరిపారు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

యర్రవరంలో ప్రజావేదిక

ఏలేశ్వరం: కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా మండలంలోని యర్రవరంలో ఆదివారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో కూటమి నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. 100 రోజుల పాలనను ప్రజలకు వివరించారు. అనంతరం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి పోస్టర్‌లను ఎమ్మెల్యే సత్యప్రభ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మైరాల కనకరావు అధికారులు పాల్గొన్నారు.

మల్లిసాలలో 'ఇది మంచి ప్రభుత్వం'

జగ్గంపేట: మండలంలోని మల్లిసాలలో ఆదివారం కూటమి నేతలు ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ప్రజలకు డస్ట్‌బిన్లు పంపిణీ చేశారు. ప్రజల నుంచి వ్యక్తిగత సమస్యలపై వినతి పత్రాలు తీసుకున్నారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, గ్రామ సర్పంచ్ సర్వసిద్ధి నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అసిస్టెంట్ లైన్‌మన్‌కు గాయాలు

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో విద్యుత్‌శాఖ ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. రాజానగరానికి చెందిన కనకాల అప్పారావు ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో అసిస్టెంట్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం విధులు ముగించుకుని తన స్వగ్రామం వెళ్తుండగా స్థానిక పాదాలమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అప్పారావును కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

అసంపూర్తిగా.. అలంకార ప్రాయంగా..

- దశాబ్దాలుగా నిలిచిపోయిన హోమియో వైద్యశాల భవన నిర్మాణం
- పట్టించుకోని అధికారులు


ప్రత్తిపాడులో చుట్టూ తుప్పలతో అసంపూర్తిగా దర్శనమిస్తున్న హోమియో వైద్యశాల భవనం

ప్రత్తిపాడు: గ్రామంలో ప్రభుత్వ హోమియో వైద్యశాల భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఏళ్ల తరబడి ఈ భవనం మొండి గోడలతో దర్శమిస్తోంది. దీని నిర్మాణానికి 2003లో అప్పటి ప్రభుత్వం రూ.2.50 లక్షల నిధులను విడుదల చేసింది. అధికారులు భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. ఆ నిధులతో భవనాన్ని శ్లాబ్ దశ వరకూ నిర్మించి వదిలేశారు. ప్రభుత్వాలు మారినా..అధికారులు మారినా..భవనం రూపురేఖలు మాత్రం మారలేదు. ఏళ్ల తరబడి దీనిని ఎవరూ పట్టించుకోకపోవడంతో భవనం చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి. మండలంలోని ధర్మవరం గ్రామంలో ఉండే ఈ ప్రభుత్వ హోమియో వైద్యశాలను ప్రత్తిపాడుకు 2003లోనే మార్పు చేశారు. దీనికోసం నిర్మించినదే ఈభవనం. భవన నిర్మాణం పూర్తిచేయకపోవడంతో స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని సిబ్బంది క్వార్టర్స్‌లోకి హోమియో ఆసుపత్రిని తరలించారు. ఇప్పటికీ అక్కడే కొనసాగుతున్నప్పటికీ, ప్రస్తుతం సిబ్బంది లేకపోవడంతో ఏడాదిగా మూతపడింది.

ముడి సరకుల శాంపిల్స్ సేకరణ

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రసాదం తయారీలో ఉపయోగించే నెయ్యి, గోధుమ, పంచదార, యాలకులు, అలాగే అన్నదానం, ఇతర విభాగాల్లో వాడే ముడి సరుకుల శాంపిల్స్‌ను ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి సుబ్బారావు ఆదివారం సేకరించారు. వీటిని ప్రభుత్వ లాబొరేటరీలో పరీక్షించి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. కాగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రామ్‌కుమార్ ఆదివారం ప్రసాదం తయారీ విభాగాన్ని పరిశీలించారు. నెయ్యి, ఇతర దినుసుల నాణ్యతపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జగన్నాథశర్మకు జ్యోతిష రత్న బిరుదు


తిరుపతిలో జ్యోతిష రత్న బిరుదు స్వీకరిస్తున్న డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ జ్యోతిష రత్న బిరుదు అందుకున్నారు. తిరుపతిలో ఆదివారం విశ్వజ్యోతి జ్యోతిష విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జ్యోతిష సమ్మేళనంలో ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. జ్యోతిష రత్న బిరుదు పొందిన జగన్నాథశర్మకు పలువురు అభినందనలు తెలిపారు.

ముంచుతూ.. ఎండగడుతూ..

- అతివృష్టి, అనావృష్టితో అన్నదాతలకు నష్టాలు
- ఇటీవల పంటలను ముంచెత్తిన వరదలు
- ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలకు ఎండిపోతున్న వైనం
- లబోదిబోమంటున్న రైతన్న


కాకరాపల్లిలో నీరు లేక బీటలు వారిన వరిచేను

కోటనందూరు: వాతావరణంలో నెలకొన్న అనూహ్య మార్పుల కారణంగా రైతులు నష్టాల పాలవుతున్నారు. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు అన్నదాతల పాలిటశాపంగా మారాయి. ఎన్నో వ్యయప్రయాసలతో సాగు చేసిన వరిపంట ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు నీట మునిగి తీవ్రంగా దెబ్బతింది. కాగా అదేపంట వారం రోజులుగా వేసవిని తలపించేలా కాస్తున్న ఎండలకు ఎండిపోయే దుస్థితి నెలకొంది. నిన్నమొన్నటి వరకూ ముంపు బారి నుంచి వరి పంటను రక్షించుకునేందుకు అష్టకష్టాలు పడిన అన్నదాత ప్రస్తుతం నీటి ఎద్దడిని తీర్చేందుకు మల్లగుల్లాలు పడుతున్నాడు. 40 డిగ్రీలకు పైబడి కాస్తున్న ఎండలతో నెర్రలు తీసిన పంటపొలాలను చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. తీవ్ర ప్రతికూల పరిస్థితులతో పైరుపై తెగుళ్ల దాడి భారీగా పెరిగిపోయింది.

36 వేల ఎకరాల్లో వరిసాగు

ఈ ఏడాది తుని సబ్‌డివిజన్ పరిధిలోని కోటనందూరు, తుని, తొండంగి, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో 36 వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఇటీవల సంభవించిన తుపానుల ప్రభావంతో 2,300 ఎకరాల్లో వరి పంట నీటమునిగినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. కాగా ఆరుగాలం కష్టపడి వ్యయప్రయాసలతో సాగు చేసిన వరిపంట కొద్దిరోజులుగా కాస్తున్న ఎండలకు ఎండిపోతోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మరో వారం పాటు కొనసాగితే తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తాండవలో తగ్గుతున్న నీటినిల్వలు

ఇటీవల వరద ప్రభావంతో నిండుకుండలా మారిన తాండవ జలాశయంలో నీటినిల్వలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఐదురోజుల పాటు అదనపు జలాలను క్రస్‌గేట్లను ఎత్తి సముద్రానికి విడుదల చేశారు. ప్రస్తుతం ఎండలు మండిపోవడంతో సాగునీటి అవసరం పెరిగింది. రైతుల డిమాండ్ మేరకు కాలువలకు భారీస్థాయిలో నీటిని విడుదల చేయాల్సిన అవసరం వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టులో క్రమంగా నీటి నిల్వలు తగ్గుతున్నాయి. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా ప్రస్తుతం 378.2 అడుగుల నీటినిల్వలు ఉన్నాయి. జలాశయం నుంచి ఎడమ ప్రధాన కాలువకు 300 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువకు 200 క్యూసెక్కుల చొప్పుడు నీటిని విడుదల చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల్లో శివారు ప్రాంతాలకు నీరు చేరడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంటలు ఎండి పోతున్నాయి



వారం రోజులుగా వేసవిని తలపించేలా కాస్తున్న ఎండలకు వరిపొలాలు ఎండిపోతున్నాయి. తాండవ నీరు శివారు ప్రాంతాలకు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంట పొట్టదశకొచ్చే సమయం ఇది. చెరువులు, కాలువల్లో నీరు నిండుకుంది. రైతుల ఇబ్బందుల దృష్ట్యా తాండవ నీటి విడుదల శాతాన్ని పెంచాలి.

– కరక అప్పలనాయుడు, రైతు, కేఈ చిన్నయ్యపాలెం

నీటిని పొదుపుగా వాడుకోవాలి



తాండవ కాలువ 1.5 కిలోమీటరు వద్ద అక్విడెక్టు మరమ్మతులకు గురి కావడంతో కాలువలకు నీటిని విడుదల చేయడంలో కొంత ఇబ్బంది నెలకొంది. తాత్కాలిక మరమ్మతులు చేసిన తరువాత రెండు రోజులుగా తక్కువ నీటిని విడుదల చేసి పరిస్థితిని పరిశీలిస్తున్నాం. నీటి విడుదల శాతాన్ని మరింత పెంచి శివారు ప్రాంతాలకు సైతం నీరందించేందుకు కృషి చేస్తాం. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలి.

– అనురాధ, డీఈఈ, తాండవప్రాజెక్టు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సభ

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో ఆదివారం ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ సభ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టాల్సిన భవిష్యత్ కార్యచరణపై చర్చించారు. మహాసేన రాజేష్ ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యచరణపై పలు నిర్ణయాలు తీసుకున్నారు.